

# మంటు కలసింది కంటు మొలచింది

"మమ్మీ! నీకింతకంటె మంచి పేరే దొరకలేదా? నాకెందుకీ పాడు పేరు పెట్టావు?" స్కూలు నుండి వచ్చిన గంగ పుస్తకాలు టేబిల్‌పైన విసిరి కొడుతూ సోఫాలో దభాలున కూలబడింది. దానికి ఇంత కోపం ఎందుకు వచ్చిందో, ఎన్నడూ లేనిది ఈరోజు ఎందుకిలా విసుక్కుంటూ ఉందో నాకేమీ బోధపడలేదు.

"ఏమిటే ఇప్పుడేమయిందని?"

"అయ్యేదంతా అవుతూనే ఉంది. స్కూల్లో అందరూ వెక్కిరించడమే గంగీ, గంగూ అంటూ. వాడెవడో వెధవ 'గంగిగోవు పాలు గంటెడైనను చాలు' అంటూ నన్ను చూసి పాడుకుంటూ పోయాడు. ఇంకొకడు పరోక్షంగా 'అన్నీ ఉండి ఆ పేరేందిరా! అలాంటిది పెట్టుకున్నావు?' అంటూ ఏదో సానుభూతి వెలిగించాడు. ఈ పేరేమిటో "గంగట! గంగ!" గాడిద గుడ్డు! పంగు అని పెట్టకపోయావు, జన్మ ఇచ్చినందుకు కర్మ అనుభవించమని?"

గంగ ధోరణి నాకు బొత్తిగా నచ్చలేదు. ఏదో పూనకం పూనినట్లు ఇంకా అంటూనే ఉంది.

"మమ్మీ! రేపటినుంచి నాపేరు మార్పించుకుంటాను. నాకీ పేరు వస్తే ఇష్టం లేదు."

జగదీష్ కూడా బడినుంచి వచ్చాడు కాబోలు, "ఓహో! గంగమ్మ తల్లిగారు ఏమిటో ఓంకారం లేని మంత్రాలు పఠిస్తున్నారల్లే ఉందే!" అంటూ దాన్ని

మమత ఎందుకు ఎవరిమీద ఎప్పుడు ఏర్పడుతుందో తెలియదు. మనిషి గుణగణాలతో మమతకు నిమిత్తంలేదు. మనిషి లేనంతమాత్రాన మాసిపోదు. మమతానుబంధానికి ఉన్న మాధుర్యం ఎంతటిదో ఎలా చెప్పడం! అయితే ఒకరి మమతను ఎంతటి సన్నిహితులు ఆత్మీయులు అయినా మరొకరు అర్థం చేసుకోలేరు.

---

మరింత ఉడికించాడు. గంగ మరింత రెచ్చిపోయింది.

"ఒరేయ్! పిడత మొహం! వీళ్ళందరూ మంచి మంచి పేర్లు పెట్టుకొని నాకే దరిద్రపు పేరు పెట్టింది గాక, నన్నే ఎగతాళి చేస్తావురా?" ఉరిమింది వాణ్ణి చూసి గంగ.

"అలాగా! అయితే నీకో మంచి పేరు సెలక్టు చేసి చెప్పనా? చిచ్చుబుడ్డి అయితే బాగుంటుందేమో!"

గంగ వాడిమీద చిచ్చుబుడ్డిలాగే జుయ్యుమని లేచింది.

"ఇందాక నీవే అన్నావుగా!, నాపేరు పిడత మొహం అని అలాంటి మంచి పేరు నీకు పెట్ట లేదని. పాపం నీ కడుపెందుకు ఉబ్బిపోవాలని ఈ పేరయితే నీకు బాగుంటుందనుకున్నాను. టా . . . టా . . . చిచ్చుబుడ్డి దేవిగారూ!" అని వాడు ఆడుకునేందుకు తుర్రుమన్నాడు. చేసేదిలేక గంగ నన్ను దుయ్యబట్టసాగింది.

"చదువూ, సంస్కారం అన్నీ ఉన్న అమ్మ నాన్నలు నాకే మొరటు పేరెందుకు పెట్టారో! ఇంతకంటె మంచి పేరే దొరకలేదేమో! వెధవ పేరు పెట్టి ..."

"గంగా!" నా శక్తికొలది గట్టిగా కేక వేశాను. గంగ ఉలిక్కిపడింది. మాట్లాడుతున్నదల్లా నోరు అలాగే తెరుచుకొని ఉండిపోయింది ఆశ్చర్యంగా. గంగ అలా నివ్వెరపోవడానికి కారణం, పుట్టి పెరిగినప్పటి నుంచీ నేనలా దాన్ని గట్టిగా కేక వెయ్యడం ఎప్పుడూ విని ఉండలేదు. "మక్కీ" అంటూ నన్ను గట్టిగా పట్టుకొని కుదిపింది. నాకంట్లో నుంచి కన్నీటిబొట్లు చెంపలమీద జారి టపటపమని కింద పడసాగాయి. నాముఖం వస్త్రాలు తెంచుకొని ప్రవహించింది. ఆ ప్రవాహంలో ఒక పవిత్రమూర్తి నిర్మల తేజస్సుతో వెలిగిపోతూ అగుపించింది. "గంగా" అని మనస్సులోనే ఆ పేరు ప్రేమాంజలితో స్మరించాను. ఆ మూర్తి నిండుగా నవ్వింది. ఆ జ్యోతి నాలో లీనమైన ఆత్మజ్యోతి. అమరజ్యోతి. ఆరని జ్యోతి! అదే నాహృదిలో జాజ్వల్యమానంగా వెలిగింది. వెలుగుతూ ఉంది.

గంగ కిదేమీ అర్థం కాలేదు. నా కన్నీరు, నా స్తబ్దత గంగను కలవరపరిచాయేమో నావైపు అమాయికంగా చూస్తూ నా కన్నీరు తుడిచింది. అవే చూపులు. అచ్చం అవే కళ్ళు. గంగను నా పక్కన కూర్చోబెట్టుకున్నాను. అవే కళ్ళు అమాయికంగా ఈ పరిస్థితి అర్థం కానట్లు, ప్రాధేయపడి చెప్పమన్నట్లు అడిగాయి. గతంలో ఎన్నో స్మృతులు తెరపై బొమ్మల్లా కనపడసాగాయి.

"తీసుకోవమ్మా తల్లీ! నీ కూతురిని. భీముడితో ముష్టియుద్ధం చేసినట్లే ఉంది." పాపను అందిస్తూ ప్రభాకర్ చిన్నగా నవ్వాడు.

"ఇంకా కాసేపు ఎత్తుకోరా, నీసొమ్ము ఏమీ పోదుగానీ." వచ్చిన పాలాలు రైలుకిటికీలోంచి చూస్తూ పాపను తీసుకోకుండా అన్నాను.

"చాలు. చాలు! మూతీ ముక్కూ వాయగొట్టింది ఇందాక. అది చాలక ఇంకా కాసేపు ఎత్తుకోవాలట!"

"ఇప్పటినుంచే మామను అదుపులో ఉంచుకుంటుంది లేరా!"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? నా కూతురిని చేసుకోవూ?" అన్నాను వాడి వైపు తిరుగుతూ.

"అక్కో! ఎందుకు చేసుకోను!" పది మంద్రగబ్బులు ఒక్కసారి మూతిమీద కుట్టినట్లు పెట్టాడు ముఖం. నాకు నవ్వు వచ్చింది.

"ఏం? బాగాలేదా ప్రభా! నా చిట్టితల్లి పుత్తడి బొమ్మలాగుంటేనూ!" పాపను చూస్తూ మురిసిపోయాను.

"అవునవును. నీ కూతురొక పుత్తడిబొమ్మే. కాదనే వాడికి ఎన్ని గుండె లుండాలి? కానీ. ఇది పెరిగి పెద్దదయి కాపరానికి వచ్చేసరికి నీతమ్ముడికి పళ్ళా, కళ్ళా రెండూ ఉండవుగానీ, చేతిలో కర్ర మాత్రం ఉంటుంది." అన్నాడు తమ్ముడు బిగ్గరగా నవ్వుతూ.

"కాటికి కాళ్ళు చాచుకునే ముసలాళ్ళకే కన్నెపిల్లలు కావలసివస్తున్నప్పుడు మహా నీవయస్సెంతరా?"

"అంత పాపం నా మెడకెందుకు కంటగడతావు తల్లీ. నీపుత్తడిబొమ్మకి ఒక ఇత్తడి బొమ్మను చూసి ముడి వేసెయ్యి సరిపోతుంది." అన్నాడు.

"ఏం పాపా! మామను చేసుకోవూ?" ప్రభాకర్ చేతుల్లో ఉన్న పాపకేసి చేతులు చాపుతూ అడిగాను. పాప చిన్నగా నోట్లో రెండువేళ్ళు వేసుకుని ఏమర్థం అయిందో ఏమో గాని "ఉంగా, ఉంగా" అని బదులిచ్చింది బోసి నోటితో నవ్వుతూ.

తమ్ముడు చిన్నగా నవ్వుతూ, "అసాధ్యురాలే! అన్నిటికీ సై అంటుంది. తీసుకో అక్కాయ్. నా బట్టలన్నీ ఖరాబు చేస్తుంది" అన్నాడు పాపని అందిస్తూ. అమాయికంగా నవ్వుతూ పాప నా ఒళ్ళో వాలింది.

"అప్పటికీ ఇప్పటికీ పాప ఎంత ఎదిగింది అక్కాయ్!"

"చాలా రోజులయింది కదూ?" అన్నాను.

"రోజు లేమిటి నెలలవుతుంటేను!"

నిజమే. అందరూ పుట్టింటికి పండుగ పండుగకూ పోతూ వస్తూ ఉంటారు. కానీ, నే నంతటి అదృష్టాన్ని తెచ్చుకోలేదు. వస్తే మా పుట్టింటివారే వచ్చి చూసి పోవాలి. ఏ ఆరునెలలకో ఒకసారి అలా పుట్టింటికి ప్రయాణం అవుతూంటాను నేను. సాధారణంగా మా శ్రీవారికి సెలవు దొరకదు. సెలవు దొరికినా ప్రయాణానికే మూడు నాలుగు రోజులు రానూ పోనూ గడిచిపోతాయి. నన్ను ఒక్కదానినే పొమ్మంటారు. కానీ, వారు రాకుండా నే ఒక్కత్తినే పోవాలంటే నా కిష్టం ఉండదు. అందులోను దూరప్రయాణం. అందుచేత మనస్సు అంగీకరించదు. ఇలాంటి కారణాలు అనేకం ఉండటంవల్ల పుట్టింటికి నా రాకపోకలు తగ్గాయి. ఈసారి ఆయన ఒక నెలరోజులపాటు హైదరాబాద్ కాంపు వెళ్ళవలసి వచ్చింది. తమ్ముడు ఎటూ నన్ను చూసిపోవడానికని వచ్చాడు. వాడు ఎలాగూ తోడు ఉంటాడు. అందులోను ఆయన నెలరోజులు కాంపు

---

## బి. వి. రమణమ్మ

---

వెడితే ఒంటరిగా ఉండే బదులు అలా పుట్టింటిలో గడిపివేస్తే అందర్ని చూసినట్లూ ఉంటుంది. ఆ నెల రోజులూ తమ్ముళ్ళతో, చెల్లాయితో ఆనందంగా దొర్లిపోతాయి. వారు కూడా అనుమతించినందు వల్ల తమ్ముడితో పుట్టింటికి ప్రయాణమయ్యాను.

ఏదో చిన్న స్టేషన్ వచ్చింది. తమ్ముడు ఫ్లాస్కు తీసుకువెళ్ళి కాఫీ పట్టుకువచ్చాడు.

"అయితే ప్రభా, మన ఊరిలో అంతా బాగున్నారు కదూ?" ప్రభాకర్ పకపకా నవ్వాడు. పాప కూడా బోసి నోటితో నా జుట్టు లాగుతూ నవ్వింది.

"బలే బాగుంది నీ ప్రశ్న. ఇది ఎలాగుందంటే దొంగలు పడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్లుంది" అన్నాడు.

"అయినా ఇది ఎన్నోసారి అడగడం అక్కాయ్!"

"పోరా నీవు మరీనూ! ఏదైనా మనకి ఇష్టమైన విషయం ఒక్కసారి వింటె అంత తృప్తిగా ఉండదు. ఎవరైనా చెప్తుంటూ ఉంటే మరీమరీ విని ఆనందించడానికి ఇష్టపడతాను. మా బావగారి ఉద్యోగం ధర్మమా అని అందరికీ దూరంగా ఉండిపోయాను. ఊరు దగ్గర అవుతున్నప్పుడు ఆనందం పట్టలేక, అందరూ ఎలాగున్నారోనని సంతోషపడాలని కోరింది నాహృదయం. నా ఆనందం ఇలాంటిదని ఎలా చెప్పను ప్రభా?"

'స్త్రీ అయిన తరువాత పుట్టింటిమీద ఆమెకున్న మమకారం నీకెలా తెలుస్తుంది?' అన్నట్లు చూశాను వాడివైపు.

"ఆహాఁ చెప్పకున్నా తెలుస్తూనే ఉందిగా? అప్పుడు గానీ వినోదమ్మగారూ! ఈ మధ్య కథలు తెగ రాసి పడేస్తున్నారటనే! ఎంతవరకు నిజం?"

"నీవు విన్నంతవరకే. కానీ, గంగ బాగుందా?" అడిగాను కుతూహలంగా.

తమ్ముడు చెప్పింది విని నేను కొయ్యబారి పోయాను. రైల్లో నేను ప్రయాణం చేస్తున్నానేగానీ నా గుండెలో వేయి రైళ్ళు పరిగెత్తసాగాయి. పాప గాలికి నా ముఖం మీద పడే జుత్తు లాగుతూ నా ముఖంలోకి చూస్తూ బోసి నవ్వులు ఒలకబోస్తోంది. పాప కళ్ళు . . . నా భవాని కళ్ళు అచ్చం గంగ కళ్ళలాగే ఉంటాయి. ఎంతో కాంతితో మెరుస్తూ ఉంటాయి. భవాని పుట్టిననాడే ఆ కళ్ళలోని కాంతిని చూసి ఆ కళ్ళు గంగవే అనుకున్నాను. "గంగ" అన్న పేరు తలుచుకోగానే ఎందుకో ఒళ్ళంతా ఒక విధమైన గగుర్పాటు చెందింది.

గతంలోని ఎన్నో స్మృతులు, గంగను మార్చిన విశేషాలు, మరెన్నో గుర్తులు ఒకదానిపై మరొకటి జ్ఞాపకం రాసాగాయి.

మా ఇంటికి ఎదురుగానే గంగ ఇల్లు కూడా ఉండేది. వారు వృత్తికీ కులానికీ కూడా వేరేవారు. వారి నాన్నకు కర్మవశాత్తు మధ్యలోనే కళ్ళు పోయాయి. గంగకు

## ఆంధ్రప్రభ

**సచిత్ర వారపత్రిక**

**1965, నవంబరు 1 నుంచి**

**కొత్త ప్రకటన రేట్లు**

**కాజువల్:** కాలం సెం. మీ. 1 కి 7—50

**కంట్రాక్టు:** కాలం సెం. మీ. 1 కి రు. 6-80

(250 సెం. మీ. లు, ఆపైన)

(ప్రకటనకు కనీస స్థలం సెం. కాలం—5 సెం. మీ. లు)

**అట్ట పేజీలు**

**4 వ పేజీ-రెండు రంగులు**

**కాజువల్:** ప్రకటన 1 కి రు. 1100/—

**కంట్రాక్టు:** ప్రకటన 1 కి రు. 950/—

(కనీసం 6 ప్రకటనలు)

**2 వ పేజీ, 3 వ పేజీ—**

**ఒక రంగు**

**కాజువల్** ప్రకటన 1 కి రు. 700/—

**కంట్రాక్టు** ప్రకటన 1 కి రు. 600/—

(కనీసం 6 ప్రకటనలు)

**కొలతలు:**

కాలం వెడల్పు 5 సెం. మీ.

కాలం నిడివి 23 సెం. మీ.

పేజీకి 3 కాలంలు

*ఇతర వివరములకు దిగువవారికి వ్రాయండి:*

**అడ్వర్టయిజ్‌మెంట్ మానేజర్,**

**ఆంధ్రప్రభ**

**సచిత్ర వారపత్రిక**

**ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు- 2**


# మంట కలిసింది, కంట మొలిచింది

ఒక పెళ్ళి అయిన అక్క, ఎస్. ఎస్. ఎల్. సి. చదివే తమ్ముడు, ఇంకా చిన్న చెల్లెళ్ళు ముగ్గురు ఉండేవారు. వారిది చాలా పేద కుటుంబం. అందులో కుచేల సంతానం. ఆపైన అంధుడైన తండ్రి. ఇంట్లో చిన్నపిల్లతో సహా ఆ కబోది వరకూ మేదరి పని చేసేవాళ్ళే. ఆ చేటలు, గంపలు అమ్మగా వచ్చిన రూకలతోనే వారి పొట్ట గడవాలి. అయితే గంగ తన తమ్ముడికి మాత్రం ఏ పనీ చెప్పేదికాదు. వాడు బాగా చదివి పైకి రావాలని గంగ కోరిక. గంగ స్వతహాగా చాలా మంచిది. పైగా తెలివితేటలు గల అమ్మాయి కూడా. ఏమంత ఎంపుగత్తె కాకపోయినా కానీ అందమైన ఆ కళ్ళు వింత తేజస్సుతో మెరిసిపోయి గంగ ముఖానికి మరింత శోభ చేకూర్చేవి. గంగ పాత నూలుచీర కట్టుకున్నా పూరి గుడిసెలో కర్మవశాత్తు తలదాచుకుంటున్నా, కథల్లోని రాజకుమార్తె జ్ఞాపకం వచ్చేది నాకు.

గంగ తిన్నా తినకపోయినా, నిండుగా తొణకని కుండలా ఉండేది. తృప్తిగా నవ్వేది. మొక్కకు నీరు పోయకున్నప్పటికీ చక్కగా వికసించిన కుసుమంలా ఉండేది ఆ నవ్వు. నాకు గంగ అంటే ఎంతో ఇష్టం. ఎందుకో చెప్పలేను. మా ఇద్దరి మధ్య ఉన్న అపార స్నేహ వాత్సల్యాలే కారణాలు కావచ్చు. పూర్వజన్మ సుకృతమే కావచ్చు. మరేమయినా కావచ్చు. కానీ, మా మధ్య ఉన్న ఆ అనుబంధం మాత్రం ఎంతో విలువైనది, మరెంతో పవిత్రమైనది అని మాత్రం చెప్పగలను.

గంగ నా చిన్ననాటి స్నేహితురాలు. ఆత్మీయురాలు. అయితే గంగకూ నాకూ మధ్య అంతస్తులు ఒక గోడలా నిలిచిపోయాయి. అయినా ఆ గోడ ఎక్కి గోడకింద ఉన్న గంగను చేరాలని తాపత్రయపడతాను. గంగ చేతులు చాపి నాకు చేదోడుగా నిలుచుంటుంది. గంగ అనురాగాభిమానాల వల్లనే నేను సులభంగా గంగను చేరుకుంటాను. అంతస్తుల కింద ఇద్దరం ఒకటై పోయి ఆనందం అనుభవిస్తాము.

గంగ అంటే మా ఇంట్లో అందరూ అభిమానిస్తారు. మా స్నేహాన్ని ఎవరూ ఎప్పుడూ చెరప ప్రయత్నించలేదు. అది తనకేమి జరిగినా ప్రతి ఒక్కటీ నాకు దాచకుండా చెప్పేది. గంగ చెప్పే ప్రతిమాటా నేను తప్పక వింటాను. గంగ మాట్లాడిందంటే ఏదో ఒకటి చెప్పి నన్నెప్పుడూ నవ్విస్తూనే ఉంటుంది.

"ఇనోదమ్మగారూ! మీ పేరు బలే ఇనోదంగా ఉంటుందండీ! మీ ఇంట్లో ఓరయినా ఇనోదా, ఇనోదా అని పిలిస్తే నాకు గోయిందా, గోయిందా అనే ఇనబడ్డదండీ" అని కిలకిలా నవ్వేది.

"ఇదుగో గంగా! ఆ 'గారు' ఏమిటే తోకలా, అలా పిలవద్దు" అని అంటే అది వింటేనా? "పొండి అమ్మగారూ! అట్లా పిలిస్తేనే నాకు తృప్తి" అనేది తలవంచుకొని.

ఆరోజు సాయంత్రం కూలికి వెళ్ళింది కాబోలు, గంప చంకలో పెట్టుకొని ఒయ్యారంగా రాగి కంకులు నములుతూ వస్తూంది. పాపం, దాని ముఖమంతా నల్లగా వాడిపోయి ఉంది. నన్ను చూడగానే చిన్నగా నవ్వింది. ఆ నవ్వులో ఏదో తెలియని అవ్యక్తానందం గోచరించింది నాకు. నాపై దానికంత అభిమానం కలిగినందుకు నాకు అప్పుడప్పుడు గర్వంగా కూడా ఉండేది.

రాత్రి భోజనం చేసి వచ్చింది గంగ. "ఏం గంగా, కూలికి వెళ్ళావా ఈరోజు?"

"అవునండి అమ్మగారూ! రాగి కంకులు కోస్తే రోజుకు మువ్వావలా కూలిడబ్బులిచ్చి పైగా రాగి కంకులు కూడా పెడతారండి. ఈ చేటలు, జల్లెళ్ళు అల్లి అమ్ముకొచ్చినా అంత రాదు కదండీ! అందుకని ఇయ్యాలనుంచీ కూలికి ఎలుతుండాను. ఇదుగో తీసుకోండి!" అంటూ పులిమిన పచ్చి రాగులు నా చేతిలో పోసింది.

"ఇవెందుకే ఇప్పుడు?" అన్నాను.

"ఎందుకంటారేంటిఅమ్మగారూ! తినేందుకు. ఎంత కమ్మగా ఉంటాయని. కాసింత బెల్లపు వడక కలుపుకొని తింటే ఇంకా బాగుంటాయి. మాలాంటోళ్లకు ఇవే బూంది, ఇవే కారాలు, మిరియాలు, అన్నీ ఇవే. మీరెన్నడూ తినలేదేమో, తినండమ్మగారూ! మీ రివి తింటూంటే నేనొక మంచి కథ చెబుతాను" అంది. తన పిడికెడు నిండా మిగిలిన పచ్చి రాగులన్నీ నా చేతిలో పోస్తూంటే నాకు కృష్ణ కుచేలుర ఆదర్శ మైత్రి స్ఫురణకు వచ్చింది. తృప్తిగా తిన్నాను. ప్రేమ కలబోసి ఇచ్చిన ఆరాగులు నాకు బూందీకంటే తేనెకంటె తియ్యగా రుచించాయి.

"ఎలా ఉండాయమ్మగారూ!"

"బలే బాగున్నాయి. కానీ, ఇందాకా కథ చెబుతానన్నావు కదే. ఏమిటూ కథ ? ఎవరి కథ?"

"ఓరి కథతో నాకేటి పనండి. మా గంగ కథే." గంగ చెప్పింది.

ఆరోజు తోటలో జొన్న సజ్జ కంకులు కోస్తున్నారట కూలీలంతా. కూలీలలో ఆడా మగా అంతా ఉన్నారట. గంగకు వరుసకు నరిసిగాడు మామ కావాలి. వాడు కూడా ఆరోజు కూలికి వచ్చాడు. నరిసిగాడికి సుమారు నలభై అయిదేళ్ళు ఉంటాయి. అతడు పెళ్ళి చేసుకున్న ఏడాదిలోనే మొదటి భార్యచనిపోయింది. ద్వితీయ వివాహం చేసుకున్నాడు. ఆమె కూడా త్వరలోనే తనువు చాలించుకుంది. తృతీయ వివాహంచేసుకున్నాడు. తృతీయ కళత్రం కూడా ఒకరోజు ఎవరికీ తెలియకుండా, ఏ జబ్బూ లేకుండా గుటుక్కుమని ఊరుకుంది. పాపం వయస్సైతే ఉందిగానీ అతని జాతకం బాగా లేదని మళ్లీ పిల్లని ఎవ్వరూ ఇవ్వలేదు. అప్పటి నుంచి నరిసిగాడు ఒంటరివాడే. కాస్త వయసు పిల్ల కంటపడితే వాడి కన్ను ఊరుకోదు. అందుకనీ వాడంటే అందరికీ ఏవగింపే.

అందరూ తలోక పక్క కోస్తూ ఉంటే నరిసిగాడు గంగ వరుసలోకి వచ్చి కొయ్యసాగాడు.

"ఏమే పిల్లా! ఈరోజు బలే ఉషారుగా ఉండావు!" అన్నాడు నరిసిగాడు.

"మామా పక్కనుంటే ఉషారుగా ఉండకుంటే ఎట్టాగ!" అంది గంగ.

"హి . . . హి . . . హి . . .బాగా పలికావే పిలకలా,

ఏటే గంగా, నీకేవడూ సంబంధం రాలా?" ఇకిలించాడు నరిసిగాడు.

"హి... హి... హి.... ఓరూ రాలేదు మావా! ఇప్పుడామాట ఎందుకొచ్చింది?" గంగకు వాడి సంభాషణ, వాడి వెకిలి చేష్టలు నచ్చలేదు.

"అహ ఏమీ లేదే. మాకు పప్పన్నం ఎప్పుడు పెట్టిస్తావో అని."

"పాపం! ఇంట్లో ఆడగువ్వలేదు గందా! నోరు సెడిపోయుండేంటి మావా. ఈ రోజ మా ఇనోదమ్మ గారు పప్పన్నం పెట్టిస్తే వద్ది కట్టుకొచ్చాను. ఆడుంది. తిను పో." నరసరా కంకులు కోస్తూ ఓమాటు నరిసిగాణ్ణి చూసి అంది.

"ఎంత దయే నీకు ఈ మావ పైన." కన్ను గీటాడు నరిసిగాడు.

గంగకు ఒళ్ళు మండింది. "ఏం మావా, కనుమావు మందమయిందేంటి? కన్ను అట్టా మూసుకుంటూ తెరుస్తుండావు?"

"సక్కని సుక్క కంటబడితే మరేది కనబడదే పిల్లా."

"ఒహో! అట్టాంటి జబ్బా! మూడుసార్లు ముండ మోస్తివి గందా మావా! మల్లా యాడ జూస్తివి సక్కని సుక్కను?" అంది గంగ.

"నా పక్కన సక్కని సుక్కవు, సుక్కల్లో సక్కని దానవు నువ్వుండంగా యాడో సూడ్డమేంటే?" సగం సగం కంకులు వదిలేసి గంగను చేరుకున్నాడు.

"ఏంటి మావో! బలే కయుత్తం మాట్టాడు తుండావే. మూడుసార్లు ముండమోసి సగం ముసలోడి వైనా ఇదేంటి బుద్ధి నీకు? ఏదో మావవు గందా అని చనువుగా మాట్టాడితే య్యవ్వారం సానా ఉందే. ఒహో! ఒళ్ళు దగ్గరుంచి మాట్టాడు." గట్టిగా కేకలేసింది గంగ.

"అట్టా గట్టిగా కూతలెయ్యబాకే. నేను సెప్పేది కూసింత ఇను."

"ఏటంటావ్ కూసింత! కంటికి రవ్వంత నక్కు గుపిస్తే పిలు నరసాలు సాగిస్తావు! స...ర...సా...లు" అంటూ సాగదీసింది గంగ.

"అది గాదే గంగా! నన్నుచేసుకున్నావంటే మా పెద్దత్త సొమ్ములన్నీ నీకే పెడతాను. నిన్ను పువ్వుల్లో పెట్టుకొని పూజ సేసుకుంటానే." మత్తు మత్తుగా కైపు కళ్ళతో గంగను చూస్తూ అన్నాడు.

"పువ్వుల్లో పెట్టి ఎందుకు పూజ సెయ్యవు! తాళి కట్టిన మావాళ్ళల్కే నన్ను కూడా పెద్దల్లో కలిపేసి, పూలు పెట్టి పూజ సేస్తావు. సాంబ్రాణి పొగ కూడా ఏసి మొక్కుకుంటావు" అని గంగ వాడి పీడ వదిలించుకోవాలని త్వరత్వరగా కంకులు కోయ సాగింది. అప్పటికే అక్కడఅంతా చాలా దూరం పోయారు. ఏపుగా పెరిగిన జొన్న మొక్కల మధ్య గంగ, నరిసిగాడు మాత్రమే మిగిలారు. కంకులు వడివడిగా కోసుకొని పోతున్న గంగ చేతుల్ని బలమైన రెండు చేతులు వచ్చి పట్టుకున్నాయి. గంగ ఉలిక్కిపడి చూస్తే ఎదురుగా చింత నిప్పుల్లాంటి ఎర్రని కైపు కళ్ళతో నరిసిగాడు. విడిపించుకునేందుకు ప్రయత్నం చేసింది గంగ. కాని, బలమైన నరిసిగాడి ముందు సుకోలా గంగ బలహీనురా లయింది. కామావేశంతో మెరిసిపోతున్న వాడి కళ్ళు చూసేటప్పటికి గంగ వణికిపోయింది! గట్టిగా కేక వేద్దామనుకుంటే నోరు పెగిలి రాలేదు. అంబరాన కనుమావు మేరతో ఎవరూలేరు. గంగ గుండె వేగంగాకొట్టుకోసాగింది. పులి నోటికందిన మేకలా వణికి పోయింది. ఇక కొన్ని క్షణాలకు ఒక పశుప్రాయునికి, ఒక కామాంధునికి బలి కావచ్చు. గంగ మెదడులో విద్యుల్లతలా ఒక్క మెరుపు మెరిసింది! వేయి ఏనుగుల బలం వచ్చినట్లయింది.

"అదేంటి మావా! నీ బుద్ధి కనుక్కుందామని నాటకం ఆడాను గానీ ... నీయట్టాంటోడు కోరి వస్తే కాదంటానా? సెయ్యి వదులు. బలవంతం ఎందుకు. ఆ సెట్టు కింద కూకుందాం పద." తల దించుకొని ఎక్కడాలేని సిగ్గు ఒలకబోసింది గంగ. నరిసిగాడు విజయగర్వంతో గంగను అనుసరించాడు. గంగ దద్ది మూట విప్పి "పప్పన్నం కావాలంటివి తిను మావా." ఓరగా నరిసిగాణ్ణి చూస్తూ అంది.

"ఇద్దరం తిందామే గంగా! నువ్వూ కూకో." గంగ చెయ్యి పట్టుకొని కూర్చోబెట్టాడు నరిసిగాడు.

"నువ్వు తింటూండు. నేను నీళ్ళు చేదుకు వస్తాను బావికాడ. ఏం మావా తింటూంటావుగందా!" గోముగా అడిగింది గంగ వాడి బుగ్గమీద చిటికె వేస్తూ.

నరిసిగాడు బస్సైపోయాడు. "గంగా! నామీద ఎంత ప్రేమే నీకూ. నువ్వు నా దానవైతే నిన్ను పువ్వుల్లో పెట్టుకొని పూజ చేసుకోనూ!" లేడిలా గంతులేస్తూ పోతున్న గంగకేసి అరమోడ్పు కళ్ళతో చూస్తూ అన్నాడు.

గంగ బావి వద్దకు వెళ్ళినట్లే వెళ్ళి సత్తిని, సీతాలును పిలిచి వాళ్ళ చెవిలో ఏదో ఊదింది. వాళ్ళు ఇద్దరూ సరే అంటే సరే నన్నారు. గంగ నీళ్ళచేది కడవ చంకన పెట్టుకుంది. అంతే బరువుగల మరో వస్తువు సత్తి మోసుకువచ్చింది. కడవ కాస్త దూరంగా దింపి అడుగులో అడుగు వేసుకుంటూ నరిసిగాడి వెనకాల నిశ్శబ్దంగా పోయి "మావా! నేను యాడుండానో సెప్పుకో సూస్తా!" అంటూ నరిసిగాడి కళ్ళు గట్టిగా మూసింది. గంగ హస్త స్పర్శతో నరిసిగాడి శరీరం గాలిలో తేలి పోయినట్లయింది. మరేమో అయింది. వాడు ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. గంగ సత్తికి, సీతాలుకు కళ్ళతోనే సైగలు చేసింది.

నిమిషంలో వాణ్ణి చెట్టుతో సహా మూడు చుట్లు చుట్టారు. గంగ వాడి ముఖం మీదనుంచి చేతులు తీసేసింది. వాడి కళ్ళు బైర్లు కమ్మాయి.

"గంగా! ఏంటే ఇది?" మత్తు దిగుతున్న కళ్ళతో తేరిపార చూశాడు.

"పెళ్ళి గావాలంటివి గందా మావా! నన్ను కట్టు కుందామనుకున్నావు! నేనే నిన్ను కట్టేశాను! ఉండు. అందర్ని పిలుస్తాను పెళ్ళికి" అని గంగ అందర్ని గట్టిగా కేకేసి పిలిచింది, పది అడుగులు ముందుకువేసి.

అందరూ కొడవళ్ళు చేతిలో పట్టుకొని పరిగెత్తు కుంటూ వచ్చారు.

నరిసిగాడికి జరిగిందేమిటో, ఇక జరగబోయేదేమిటో పూర్తిగా అర్థమయింది. వాడికున్న ఆ కాస్త మత్తు పూర్తిగా తొలగిపోయింది. కట్లనుంచి తప్పించుకుందా మనుకున్నాడు. కానీ, తాను పూర్తిగా బంధింపబడ్డాడు. వాడికి ఏడుపు వచ్చినంత పని అయింది.

గంగ అందరికీ జరిగింది చెప్పింది.

"ఈ ముసలాడికి పెళ్ళి గావాలంట! పెళ్ళి! కనపడిన పిల్లల నందరిని సెయ్యిట్టుకు లాగితే ఊడు ఆడినట్లు అంతా ఊరుకుంటారనుకున్నాడు ఎదవ. సింత చచ్చినా పులుసు సావనట్లు కాటికి కాళ్ళు సాచు కునే వయసొచ్చినాగానీ, పక్కన పిల్ల ఉండాలంట! థూ! జోగి ఎదవ! గంగ అంటే ఏటనుకున్నావో! దాన్ని ముట్టుకుంటే అగ్గే అని తెలుసుకో ఇయ్యాల నుంచి." గంగ రేగిపోయింది.

"మా బాగా జేసినావే గంగా! ముసలి ముండా కొడుక్కి ఇంకా నరసాలే పడుచు పిల్లలో!"

"కావలిసిందే, యాడంటే ఆడ కన్నులు గొడ తాడు." సత్తి అందుకొంది. తలోక మాటన్నారు వాణ్ణి.

"ఇదుగో మావా! ఇట్టాంటి ఎదవ్వేషాలు ఏసి వంటే చూసుకో జుట్టుకు ఈత మట్టలు కట్టి, అగ్గి ముట్టిస్తాను. ఆఁ. ఏటనుకున్నావో?" కొడవలితో



కవలలు

చిత్రం — ఎస్. ముకీర్ (బావట)

వెత్తని ఒకటి ఇచ్చింది గంగ.


సగం చచ్చిపోయాడు నరిసిగాడు. అందరిముందూ తలెత్తలేకపోయాడు. సిగ్గుతో, అవమానంతో కుంచిం చుకుపోయాడు. వాడి మనస్సు గంగ చేసిన పరాభవానికి సుడిగుండంలో చిక్కుకున్న ఎండుటాకులా గజగజ లాడి పోయింది. పశ్చాత్తాపంతో మనస్సులో లుకలుకలాడి పోయింది. నోట్లో ముద్ద నోట్లోనే ఉండి ఎక్కిళ్ళు పట్టాయి.

గంగ వాడి కట్లు విప్పి నీళ్ళు తెచ్చి పోసింది. దప్పిక తీరాక గంగ కాళ్ళపై పడ్డాడు, "గంగా! నన్ను సెమించే. లేకుంటే నీ పాదాల్ని వదల్ను" అంటూ.

"ఓ యబ్బో! సినిమాలో మాదిరి ఇదేంది? లెగు లెగు! బుద్ధి తెచ్చుకొని ఇట్టాంటి పన్లు సెయ్య కుంటే అంతేసాలు గానీ!" అంది గంగ తన పాదాల్ని

35 ఎం. ఎం. హోంసినీ ప్రొజెక్టర్

మీ ఇంటిలో నే నిజమైన సినిమా చూచిన ఆనందం పొందండి. సాధారణమైన గదులలో, మీరు కోరుకున్న సినిమా చిత్రములను తెరమీద లైటుతో, ఎలెక్ట్రిసిటీతో కూడ చూడవచ్చును. ఈ ఫ్రొజెక్టర్



స్టైజ చిత్రములు మీరు సినిమా హాలులో చూచినట్లే ఉండును. నలుపు, తెలుపు రంగులు కూడ చూడవచ్చును. వెల రు. 22.50 వి. పి. పి. చార్జీలు 4—50.

20 అ. ఫిలిం ఉచితము. అదనపు ఫిలిం గజం 1కి 25 న.పై. ప్రతేకమైన గుడ్డతెర 4/—

SANGAM TRADING CO.,
Phapala (WAP-27) Aligarh

ఆంధ్రప్రభ
సచిత్ర వార పత్రిక
చందాదారులకు
విజ్ఞప్తి

చందాదారులకు పోస్టులో ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక ప్రతులు ప్రస్తుతం మామూలుగా పంపుతున్నామని తెలియజేయడానికి ఆనందిస్తున్నాము. పోస్టుద్వారా ప్రతులు పొందగోరే పాఠకులు, చందాదారులు తమ చందా మొత్తాలను ఈ క్రింది చిరునామాకు పంపాలని కోరుతున్నాము

సర్క్యులేషన్ మానేజరు
ఆంధ్రప్రభ లిమిటెడ్
డైరెక్టర్స్ ఆఫీసు
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్
మౌంట్‌రోడ్
మద్రాసు – 2

మానేజరు

# మంట కలిసింది కంటి వెలిగింది

చిమ్మిస్తుంటూ.

"నీ సొమ్మేగా నాకు బుద్ధి వచ్చింది గంగమ్మా! నిన్ను నాకూతురికి మల్లే చూసుకుంటాను. నన్ను క్షమించాలి నీవు, నా బంగారు" అంటూ గంగ పాదాలు గట్టిగా పట్టుకొని ఏడ్చాడు సత్తెయ్య. గంగకు వాడి కన్నీరు ఆశ్చర్యము, వాడి మీదపు జాలి కలిగించాయి.

"ఛీ! మామా! ఇంతమందిలో మరియాద్దీగా పెద్దవాడవు, ఇలాంటి పని ఇంక చెయ్యకు. నేను పోయింతా మరిచిపో!" అంది.

"అప్పటినుంచి మళ్ళీ ఆడు ఒక్కరోజు కూడా నాతో మాట్లాడలేదమ్మగారూ! నాతోనే గాదు. ఏ ఆడదాన్ని చూసినా అంతే. బుద్ధిగా తలొంచుకొని పోతాడు. నాకా మారిపోయింది" అంది గంగ నాతో.

"బలే. ఇంతవరకూ ఒక మనిషిలో పరివర్తన తెచ్చింది గంగా! చాలా సంతోషం. అంతా సినిమాలో మాదిరిగానే ఉంది సుమా!" సంతోషంగా గంగ చెయ్యి నొక్కాను.

"నాకూ అట్లాగే అనిపిస్తుందమ్మగారూ! నాపై పగ సాధిస్తాడేమో అనుకున్నాను. ఆ క్షణంలోనే మారిపోనాడంటే ఆశ్చర్యమనిపిస్తుంది" అంది.

"నిజమే. మానవ జీవితాలలో మార్పు రావాలంటే రోజులూ, నెలలూ, సంవత్సరాలూ అవసరం లేదు. కొన్ని క్షణాలు చాలు. ఎలాంటి వాడి జీవితమైనా కొన్ని కొన్ని సంఘటనలతో క్షణంలో మారిపోతుంది. తాను మారు అవుతుంది. తప్పు తెలుసుకుంటాడంటే అందులో ఆశ్చర్యం లేదు!" అన్నాను.

"ఈరోజు కూడా ఇట్లాంటిదే ఇంకొకటి జరిగిందమ్మగారూ! ఆ మునసబుగారి తోటలో లేదండీ, అక్కడే ఇలయాల పని కెళ్ళింది నేను. మునసబుగారబ్బాయి పరమేశం బాబుగారని బస్తీలో చదువుకుంటున్నారే, ఆ బాబుగారు సెలవులకని వచ్చినాడంట. తోట చూసిపోదామని వచ్చినోడు వచ్చినట్టు పోకుండా నోరూ తెంచి జాసి, అదాన్ని చెయ్యి పట్టుకున్నాడండీ! నాకేం రవ్వాలు కదా అని మర్యాదగా చెప్పి చూశాను. అహా వినలేదు. నేను కేక వేస్తే అయ్యగారి గొడ గుయ్యి మనిపించి. ఆ అయ్య నాకూనూ ఉన్నారండీ. అదాన్ని కుదుర్చామని కిందపడిపోయాడు. వచ్చినవాడు నాకొడుకు, ఇంకెటు బొ అని నాగుండె అదిరిపోయాయి. కాసేపు కదిలి, లేచి నిలుచుని "ఎంత పొగరు!" అన్నాడు నల్లాడానికి పట్టిన మట్టి తుడిచుకుంటూ.

పొగరు పట్టి పెళాలెంట ఆడాళ్ళ కోసం పడుతాడే ఆ దొరగారికాపొగరు? నాదా? మీరే చెప్పండమ్మగారూ! నాకు అతికాలమంట నడినెత్తి కొచ్చిందంటే నమ్మండి!

"ఇదిగో పరమేశం బాబూ! జాస్తి మాట్లాడితే నారంటే అరకిలోమీ పీకు దక్కేది. బుద్ధిగా ఇంటి కెళ్ళి నలనా గొడ పట్టుకొని పడుకోండి. నా సంగతి మీకు తెలీదు గావాల్ను!" అన్నాను.

"ఏమే! ఎక్కువ మాట్లాడితే కూలి డబ్బులు కూడా దొరకవు! అది గావకం పెట్టుకో!" అన్నాడు.

"ఇదిగో అదమాసం, మరియాద దక్కించుకోవాలంటే ఇంటి దారి పట్టండి. ఈ జనని ఇలాంటి కూలి డబ్బులకే లొంగిపడే రకం కాదు. మానం పోనాక ఎవరు నేటం ఉంటే ఏం ప్రయోజనం? ఎక్కువ అల్లి మాట్లాడినారంటే అందర్ని కూత లేస్తా."

ఏమనుకున్నాడో ఏమో, జేబులోంచి రెండు రూపాయల నోటు తీసి ఇచ్చి 'జరిగింది ఒకరికీ చెప్పొద్దు' అన్నాడండి. అదాయి మీదే దాన్ని విసిరిపారేసి "అదేంటి బాబూ! నా బాబు అర్థం గాలా? ఈ విషయం డబ్బుకి నే నాలదనండి. ఇదే చెప్పదల్చిన లెక్కలున్నాయి. కట్టేసుకుంటాను. కడుపుకి ఇంత తింటాను. అంతేనాడి, ఓరిన్నాలి నీ డబ్బు?" అని నేనూ కాలు తాలు అని మేడలోనే కున్నాను. నన్ను ఏళ్ళలెట్టి నా వంక ఓ నిముషం చూసి "వెళ్ళొస్తా" అంటూ చకచకా నడిచాడు. నా మనస్సు సంతోషంతో పొంగిపోయింది.

కూలీకి ఆమ్మైనా, గంగలో మానాత్రం అమ్ముడవని గంగ. ఏ ఉన్నత వంశంలోనో పుట్టి ఉంటే తన గుణగణాలతో ఇంకా రాణించి ఉండేది. పేద కుటుంబంలో పుట్టి మట్టిలో పూడుకుపోయిన మాణిక్యంలా వెలిగిపోతూ ఉందని నిట్టూర్చాను.

"ఏంటమ్మగారూ! చింత చేస్తున్నారు! నేను చేసిన పని తప్పంటారా?" అమాయకంగా అడిగింది గంగ.

"నువ్వు చేసిన పని తప్పని ఎలా అంటాను గంగా? చాలా మంచి పని చేశావు!" అన్నాను. గంగ తృప్తిగా నవ్వింది.

మెల్లిగా మా ఇల్లు మీద పిల్ల మరణాలా లేచిపోతూంది. నేను మంచంలో అలాగే పడుకున్నాను. గంగ నా పక్కగా ఉన్న అరుగుపై కూర్చొని ఉంది.

"ఇంకా విశేషాలేమిటి?" అన్నాను ఆకాశంలో తారకల మధ్య వెలిగిపోతున్న నిండు జాబిల్లిని చూస్తూ. గంగ మౌనంగా ఉండిపోయింది. జవాబులేదు.

"ఏమిటే బలే ఆలోచనలో మునిగిపోయావూ? విశేషాలేమిటే అంటే జవాబే లేదేమే?" అన్నాను గంగవైపు తిరిగి.

"నన్నా అమ్మగారూ! పిలిచారా?"

"ఏమే . . . ఇంకెవర్ని అనుకుంటున్నావు? ఇక్కడ ఎవరున్నారని?" అన్నాను.

"మన మిద్దరమేనేంటి? మన మాటలన్నీ దొంగ చాటుగా వింటున్నారేమో అనుకుంటే? ఆకాశంపైనే మాకున్న మాట్లాడుతుండారనుకున్నాను."

"ఏ యబ్బో! నీకు కవిత్వం కూడా వంటబట్టినట్టుందే గంగా! ఇంత కొన్నాళ్ళకు ఇలాగే మాట్లాడావంటే నువ్వు కూడా ఏ కవయిత్రివై పోతావు సుమా!"

"ఆఁ ... అదేంటండీ అలాగంటారూ! మా ఇనోదమ్మగారు తెలుసుకోవాలేగాని, వ్రాయంలో నన్ను కవయిత్రినైనా జేస్తరు, లేకుంటే జాబిల్లినైనా జేస్తరు లెండి!" కిలకిలా నవ్వింది గంగ. నాకూ నవ్వు ఆగింది కాదు.

"అది సరే అమ్మగారూ! మొన్న వచ్చిన ఆ సంబంధం ఖాయమయిందేటి? మా కోమలమ్మగారు బస్తీలో కూకున్నోళ్ళేవాండి పెళ్ళికొడుకు?"

"ఫీపో, నీ కన్న కబుర్లు కావాలి!" సిగ్గుతో ముఖాన్ని తలది ఒడులో దాచేసుకున్నారు.

"ఓలమ్మో! మాలమ్మగారికి సిగ్గేసింది. అంటే అప్పుడుగారు పెళ్లికొడుకు!... ఎప్పుడమ్మగారూ పెళ్లి?"

"నీ తలకాయ! ... నాకేం తెలుసు?"

"నా తలకాయ మీకెట్టా తెలుస్తుంది లెండి! ఇంతకీ పెళ్లికొడుకు సల్లని మారాజులా అగుపిస్తాడు."

"సల్లని మారాజంటే...?"

"మీకు తెలిదేంటి సన్నడుగుతారు? అదుగో ఉన్నాంటి వోరు." ఆకాశం పైకి వేలుతో చూపుతూ తారకల మధ్య ఉన్న జాబిల్లిని చూపించింది.

"ఆయనెంత చల్లని వాడైనా మచ్చ ఉంది గంగా."

"మీరు సదివినోరు. అట్టాగ సెప్పుతే నా కెట్టా అర్థమవుద్దండి." నోరు సొట్టగా తిప్పుతూ అంది.

"చూడు గంగా! చందమామ చల్లగా ఉంటాడు. వెన్నెల ఇచ్చి ఎంతో హాయి కలిగిస్తాడు. ఆ వెన్నెల్లో చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా అందరూ సంతోషిస్తారు. చందమామ అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పు? చంటిపాప అన్నం తినకుంటే "చందమామ రావే! జాబిల్లి రావే!" అంటూ పాపను ఊరిస్తూ అన్నం తినిపిస్తాము. చందమామని అనేకవిధాల స్తుతిస్తూ స్వాగత గీతాలు పాడతాము. చీకటి వస్తే విసుక్కుంటాము. వెన్నెల వస్తే ఆనందిస్తాము. మరి చిన్నా పెద్దా తారతమ్యం లేక అందర్నీ ఆకర్షించే ఆ చందమామకు మసిపూసినట్టు ఆ మచ్చ లేకుంటే ఇంకెంత బాగుండునో గదా అని విచారిస్తాము. ఇంత చల్లటి చందమామకే ఆ మచ్చ ఉన్నప్పుడు సామాన్య మానవులకు ఉండదని నమ్మకం ఏముంది? ప్రతి మనిషికీ ఏదో ఒక వంకర ఉండనే ఉంటుంది" అన్నాను దానికి అర్థమయ్యే భాషలో.

గంగ మరి ఏమీ మాట్లాడలేదు. కాసేపు మౌనంగా ఉండి తన సంసారపు కష్టసుఖాలు నెమరువేసుకోవడానికి వెళ్లింది.

కొన్నాళ్లకు నాకు పెళ్లి కావడం, కాపురానికి పోవడం కూడా జరిగిపోయాయి. భవాని గర్భంలో ఉన్నప్పుడు తొలిచూలు కానుపు కోసం మా ఊరికే వచ్చాను. రాగానే గంగ వివాహం అని విని సంతోషించాను. నేను వచ్చానని తెలియగానే గంగ సంతోషించింది చాలా. ఈమధ్య గంగ బాగా ఆరోగ్యంగా, మునుపటికంటె నిండుగా ఎదిగింది. ముఖానికి పచ్చగా పసుపు రాసుకొని అస్తమిస్తున్న సూర్య బింబంలాంటి ఎర్రటి కుంకుమ బొట్టు పెట్టుకొని కాటుక కళ్లతో ఎంతో అందంగా కనిపించింది. గంగ పెళ్లి జరుగుతూంటే భవాని ఈ సువిశాల ప్రపంచంలో అడుగు పెట్టింది. అంచేత దాని పెళ్లి నేను కళ్లార చూసే భాగ్యం కలగలేదు. ఆ పురిటి భారంతో వంగిపోయిన మొక్కలా తల కిందికి దించుకొని సిగ్గు పడుతూ "అలాగేనండి" అంది.

మరునటిరోజు గంగ, దాని భర్త వచ్చారు. గంగ పెనిమిటిని చూడగానే నేను చాలా ఆశ్చర్యపోయాను. గంగ కంటె చాలా పొట్టిగా, పీలగా, గాలికి ఎగిరిపోయేటట్లుంటాడు. ముఖంలో ఏమంత కళలేదు గానీ, అతని తలపై జుట్టు మాత్రం ఒక గంపెడంత ఉంటుంది. ఉంగరాలు చుట్టుకొని చాలా ఒత్తుగా అతనికంటె బలంగా పెరిగాయి వెంట్రుకలు. పేంటు, చొక్కా వేసుకొని చాలా నీటుగా అగుపించాడు. లావుగా బొద్దుగా ముద్దబంతి పువ్వులా ఉండే గంగకూ పీపురు పుల్లలా ఉండే అతనికీ ఈడు జోడు ఏమీ కుదరలేదు. సరిగదా, పులి పక్కన మేక పిల్లలా అగుపించాడు.

ఆవీ ఇవీ మాట్లాడిన తరవాత చెల్లాయిచేత గంగకు కుంకుమ బరిణెతో సహా తాంబూలం ఇప్పించి పంపాను.



తోటల బాటలు

చిత్రం—మానేపల్లి సత్యనారాయణ (విజయనగరం-1)

పెళ్లి జరిగిన తరవాత బంధువులంతా భోజనాలకు కూర్చొని ఉంటే గంగ నన్ను, పాపను చూడడానికని వచ్చింది.

"కూర్చో గంగా! పెళ్లి బాగా జరిగిందా?" అడిగాను.

"ఎంత బాగా జరిగినా బొమ్మలపెళ్లి ఎంతసేపు జరగాలండీ?" అంది కిలకిలా నవ్వుతూ. నాకూ నవ్వు ఆగింది కాదు.

"ఇక ఈ చిలిపితనాలన్నీ మూట కట్టాలిలే. లేకుంటే చేసుకున్నోడు ఊరుకోడు" అన్నాను నవ్వుతూ.

ప్రసంగం మార్చి నేనూ "పాప అంతా అయ్యగారి పోలికేనండీ. అంతా మీవాదిరే పాపను తయారు సెయ్యాల." అంది.

"గంగా! పాప కళ్లు అచ్చం నీ కళ్లే సుమా! చూడు ఎలా మిటకరిస్తూ ఉందో." పొత్తిళ్లలోని పాపను ముద్దాడుతూ అన్నాను. గంగనుచూస్తూ "మీఆయన, నీవు ఒకసారి రండి గంగా, నేను చూస్తాను" అన్నాను.

తరవాత చాలా యోచించాను. గంగకు అంతకంటె మంచి మొగుణ్ణి చూడలేక పోయారా? నా పిచ్చి ప్రశ్నకు నాకే బాధ కలిగింది. గంగకి ఎవరున్నారు మంచి సంబంధం చూచి, తగిన వరుణ్ణి తెచ్చి పెళ్లి చేయడానికి? తండ్రి చూడబోతే కళ్లులేని కబోది. తల్లి చూడబోతే సన్నపోయ. బంధువులా ఎవరి స్వార్థం వారిదే. ఈ కాలంలో స్నేహితులైనా ఏవో కొన్ని సందర్భాలలో ఆసరాగా ఉంటారుకానీ ఈ బంధువులలా కాదు. ఎవరి స్వార్థం వారిదే. ఎవరి సుఖం వారిదే. ఎవరి ఆనందం వారిదే. అలాంటప్పుడు గంగకు తగిన వరుణ్ణి వెతికి పెళ్లి చెయ్యాలని వారి కెలా అనిపిస్తుంది? వయస్సున్న పిల్లకు అంతమాత్రమైనా పెళ్లి అంటూ చేయగలిగాడు, ఆ కబోది తండ్రి.

ఒక చక్రం పెద్దదిగా ఉండి మరొక చక్రం చిన్నదిగా ఉన్న రథం, సారథి ఎంత నేర్పరి అయినా బాట ఎంత తిన్ననిది అయినా ఆ రథం ఒక పంథాలో నడవదు. మరి గంగ జీవిత రథం ఎలా సాగుతుందో?

ఠి. ఏమిటీ ఆలోచనలు? నా గంగఉజ్జ్వల భవిష్యత్తును ఇలాహీనంగావేనెందుకు ఊహిస్తున్నాను. లోకంలో ఎంత మంది అందమైన భార్యలు అనాకారులైన తమ భర్తలతో కాపరం చెయ్యడం లేదు! వేలకు వేలు కట్నం పోసి కట్టుకున్న భర్తలు చింతపండు ముఖంతో నల్లగా నిగనిగలాడుతున్నప్పటికీ, కాకి ముక్కుకు దొండపండు లాగ తాము ఉన్నప్పటికీ, ఆ దంపతులు ఎంతో అన్యోన్యంగా, అనురాగంతో ఆదర్శ దాంపత్య జీవితాన్ని సాగిస్తూ ఉంటే గంగ జీవితం ఎందుకు బాగుపడ కూడదు? అన్నిటినీ ఓర్చుకునే గంగ తన భర్తను దైవంగానే గౌరవిస్తుంది. ముఖ్యంగా మానవ జీవితంలో, అందులో వైవాహిక జీవితంలో, సంసార సాగరంలో బ్రతుకు బంగరు నావ అయి ఒడుదుడుకులు లేకుండా ఒడ్డు చేరాలి అంటే వారిమంచి మనస్సే చుక్కానిగా దారి చూపాలి. అప్పుడే నావ ఒడ్డు చేరుతుంది. అప్పుడే జీవితం ధన్యం అవుతుంది. 'నా గంగ జీవితం కూడా మూడు పువ్వులు ఆరు కాయలు కావాలి. దాని ఆదర్శ దాంపత్యజీవితం పూలబాట కావాలి. నా గంగ సుఖపడాలి!' అనుకున్నాను. అనుకోవడమే కాదు భగవంతుణ్ణి ఆ క్షణాన మనసారా ప్రార్థించాను. అంతకంటే నేను చేయగలిగిందేముంది?

గంగ అత్తవారి ఊరు పోయి ఏదో పండుగకు పుట్టింటికి వచ్చింది. నేను ఆరు నెలల భవానితో, మావారితో సహా వచ్చి అప్పటికి వారం రోజులయింది. పెరట్లో పూలు కోసుకొని గంగ ఇంటికి నేనే పోయాను. నన్ను అలా హఠాత్తుగా చూడగానే దాని ఆశ్చర్యానందాలకు హద్దులులేవు. ఓముక్కాలి పీట వేసింది కూర్చోమంటూ. కుశల ప్రశ్నలు అవీ అయ్యాక అడిగాను "నీ భర్త నిన్ను బాగా చూసుకుంటాడా గంగా?" అని.

"బాగానే చూసుకుంటాడండి" అని గంగ చిన్నగా నవ్వింది పొయ్యిమీద పెనం పెడుతూ. అప్పటి గంగకూ, ఈ గంగకూ కొట్టవచ్చినట్లు మార్పు చాలా కనిపిస్తుంది. అప్పటి ఆ గంగ గలగల పారే సెలయేరు అయితే ఇప్పటి ఈ గంగ నిండుగా ప్రవహించే పవిత్ర గంగానది అనిపించింది.

"మీ అత్త మంచిదేనా గంగా, నిన్ను మురిపెంగా చూసుకుంటుంది గదా?" అని అడిగాను. ఎందుకంటే గంగ భర్త అనాకారి అని అంతకు మునుపు అతనికి ఎవ్వరూ ధైర్యం చేసి పిల్లని ఇవ్వలేదు. ఎన్నో అవమానాలకు గురి అయిన తరవాత ఇక కొడుక్కి పెళ్ళికాదు అని అతని తల్లిదండ్రులు నిర్ణయించుకొని ఆఖరిసారిగా ప్రయత్నించి చూస్తే గంగ సంబంధం సిద్ధపడింది. అందుచేత ఆమె గంగను అపురూపంగా చూసుకుంటుం దనుకున్నాను.

"ఆఁ ఏంటన్నారు అమ్మగారూ?" అంది గంగ. మళ్ళీ అదే ప్రశ్న వేశాను గంగ ముఖ కవళికలు గమనిస్తూ.

"ఆఁ దానోటితో సెప్పవలిసింది ఏముంది అమ్మగారూ? ఇదుగో సూడండి ఉట్టా సూస్తుంది." నవ్వింది గంగ పేలాల వేపు చూపుతూ. పొయ్యి కింద మంటకు పెనంలోని జొన్నలు చిటపటలాడుతూ తెల్లగా ఎగురుతున్నాయి. నా మనసు చివుక్కుమంది. అంటే గంగను ఆమె అత్త అలా పేలాలకుమల్లే వేయించుకు తింటుందా? తన అత్తింటి కాపు న్ని

# మంట కలిసింది కంట మొలిచింది

ఎంత సులభంగా వర్ణించింది గంగ అలా పేలాలకు మల్లే తాను అత్త దగ్గిర కష్టాలు పడుతున్నప్పటికీ ఆ నవ్వు ఎంత నిర్మలంగా ఉంది? కష్టాల్లో కూడా అంత నిబ్బరంగా నిండుగా నవ్వగల శక్తి ఎవరికి ఉంటుంది? 'గంగా, నువ్వు దేవతవు!' అనుకున్నాను.

గంగతో ఆ కాస్సేపు మాట్లాడి వచ్చాక నేను తెలుసుకున్నదిది: భర్త తన్ను అపురూపంగానే చూసుకుంటాడట. కోరిన వస్తువులన్ని తెచ్చి, అప్పుడప్పుడు సినిమాలకు కూడా తీసుకువెడతాడట. గంగ అంటే అతడికి ప్రాణంతో సమానమట. కానీ అత్త గయ్యాళిదట. ప్రతి చిన్నదానికీ పెద్దదానికీ రాచి రంపాన పెడుతుందట.

"ఆడు దేవుడంటి వోడండి. రూప మెట్టుంటే గానీ మాదొడ్డ గుణం. ఓపాల్లు మాటకూడా రాదండి ఆడి నోటికి. నేనంటే పేణమైనా ఇస్తాడు. అయితే నోరు సచ్చినోడు. అమ్మ, అయ్య ఏమన్నా కిమ్మనడు. నన్నుమాత్రం శానా ఇదిగానే చూసుకుంటాడండి. అంతకంటే నాకింకేం కావాలి? వోరు నన్ను రాసి రంపాన పడేస్తే నాకేం? నా మొగుడు శీరామసెందురుడు" అంది గంగ. ఆ భరోసాతోనే గంగ తన సంసారంలో తృప్తి పడుతూందని గ్రహించాను. అప్పుడే చూశాను గంగను. అంతే. మరి నేను మా ఊరికి పోనేలేదు.

ఆలాంటి సుగుణరాశి గంగ, నా ఆత్మీయురాలు, నా స్నేహితురాలు గంగ, కల్లాకపటం లేని గంగ నేడు చావు బతుకుల్లో ఉందిట. నాకళ్ళల్లో నీళ్ళు గిర్రునే తిరిగాయి. ఎవరో చెయ్యిపెట్టి హృదయం అంతా దేవినట్లు తోచింది. గంగ నెప్పుడు చూస్తానా అన్న ఆరాటం నాలో ఎక్కువయింది. గంగను తలుచుకుంటే నా శరీరం అంతా గగుర్పాటు చెందింది. ఏమవుతుందో ఏమో గంగ అని హృదయం తల్లడిల్లింది.

గంగను తలుచుకుంటేనే చాలు హృదయం పొంగిపోయేది. నా స్నేహలత విలాసంగా ఉల్లాసంగా ఊగిపోయేది. అంతస్తుల గోడ అథఃపతనం పొందేది. నా స్నేహక్షేత్రంలో గంగ నవ్వుకే నెమళ్ళు పురి విప్పి నాట్యం చేసేవి! మోడుబారిన వృక్షాలు చిగురించేవి. కాలంకాని కాలంలో కూడా కోయిల పాట పాడేది. గంగ నవ్వు అంత నిర్మలమైనది. అంత పవిత్రమైనది. అందరి దృష్టిలోను గంగ బుట్టలల్లుకునే సామాన్య మేదర వనిత కావచ్చు. కాని గంగ ఏ అనుబంధంవల్లనో సౌజన్యంతో నాలో స్థానం ఏర్పరుచుకుంది.

ఎవరిని తలుచుకుంటే నా హృదయం పొంగిపోయేదో, ఎవరిగాలి సోకితే నా స్నేహలత విలాసంగా లాస్యం చేసేదో, ఎవరి దగ్గిర అంతస్తుల గోడ కూలిపోయేదో ఆమే గంగ! ఆ గంగ, నా గంగ నేడు చావు బతుకుల మధ్య ఉందిట!

"హే భగవాన్! నా గంగను బ్రతికించు!" మనసారా భగవంతుణ్ణి స్మరించాను. పాప తన చిట్టివేళ్ళతో నా కన్నీటిని చెంపలలో అంతట అలుకుతూంది. అవే కళ్ళు. అచ్చంగా గంగ కళ్ళే! "భవానీ! . . . నా ఆత్మఘోష పసిదానివి నీకు అర్థం కాదు" అనుకుంటూ పాపను నా హృదయానికి గట్టిగా హత్తుకున్నాను.

నా రాకకు ఇంట్లో అంతా ఆనందించారు. ఎవరితో మాట్లాడుతున్నా నాకు తృప్తి కలగటం లేదు. అన్యమనస్కంగానే అందరికీ జవాబులిచ్చి, పాపను నిద్రపుచ్చి ఒక్క ఉదుటున తడబడే కాళ్ళతో, తపించే హృదయంతో గంగ గుడిసెలో ప్రవేశించాను. నులక మంచంలో గుడిసెకు ఓ మూలగా ఎవరో పడుకొని ఉన్నారు. గంగ ఎక్కడ ఉందో అని నా కళ్ళు ఆ గుడిసె అంతా గాలించాయి. కానీ, గంగ తప్ప ఆ గుడిసెలో అందరూ ఉన్నారు! గంగ అమ్మ నన్ను చూడగానే ఆశ్చర్యపోయింది. పీట తెచ్చివేసి కూర్చోమంది. "గంగ ఏది ముత్యాలమ్మా?" అని అడిగాను.

"గంగా, ఇనోదమ్మగారు వచ్చారు సూడు తల్లీ." దగ్గుత్తికతో మూలగా మంచంపై పడుకున్న ఆమెను చూసి అంది. నేను ఉలిక్కిపడ్డాను. ఆ మూలగా పడుకున్నది గంగా? నా గుండె జల్లుమంది. లేచి గంగ దగ్గిరికి పోయి కూర్చున్నాను.

"గంగా!" ఆవేదనతో నిండిన నా హృదయం ద్రవించింది. అనుకోకుండానే నా కళ్ళల్లో నీరు ఎంత అణచుకున్నా ఎగజిమ్మింది, ఆ ఆకారాన్ని చూడగానే నా పిలుపు విన్న గంగ నన్ను పరిశీలించి చూసింది. దాని కళ్ళు ఆనందంతో మెరిశాయి. కుష్ఠించిపోయిన ఆ పెదవులపై చిరునవ్వు తాండవమాడిం.

"అ...మ్మ... గా...రూ... నన్ను.. మా ..ర్డా..ని.. కొ...చ్చా...రా?" ఒక్కొక్క అక్షరమే కూడబలుక్కుంటూ అంది. "ఒద్దు గంగా, నిన్ను చూడ

సుమవధువులు మధువరులు

కత్తిరింపు చిత్రం — కోరా సీతామహాలక్ష్మి (కొమూరు)



దానికే వచ్చాను." మాటలు రాక పూడిపోయిన గొంతుతో అన్నాను. గంగ చేతిని తడుముతూ ఉంటే గాజులు గలగల శబ్దం చేశాయి. గంగ చెయ్యి పుల్లలా ఉంది. గాజులు మోచెయ్యి దాటి పైకి పోయాయి. గంగ తొడుక్కున్న ఆ జాకెట్టు ఏ అండాళ్లమ్మదో అన్నట్లుంది. ఒకప్పుడు నిండుగా ఆరోగ్యంగా ఉండే గంగ ఇప్పుడు ఎముకల గూడు. తోలు మాత్రమే ఎముకకు అంటిపెట్టుకొని ఉంటే గంగ మంచాని కంటిపెట్టుకొని ఉంది. నేను కలలో కూడా ఊహించలేని ఆకారంతో పోల్చడానికే అనూహ్యంగా మారిపోయింది! గంగ ఇలా అయిపోవడానికి కారణం? ఏం జబ్బు? ఎందు కిలా ఇంట్లోనే ఉంచుకున్నారు? పట్నంలో ధర్మాసుపత్రి ఉందిగా? చేర్పించకూడదా? వాళ్లమ్మను అదే అడుగుదామని ఆమెకేసి చూశాను. ఆమె నాకు కాస్త దూరంగా కూర్చుని మోకాళ్లలో తలదూర్చి నిశ్శబ్దంగా ఏడుస్తూ ఉంది. ఏదో ప్రబల కారణం ఉంటుందనుకున్నాను. ఆమె ఏడ్చి ఏడ్చి తుదకు చెప్పిన విషయం విని నేను కొయ్యబారిపోయాను! నా కాళ్ల కింది భూమి రెండుగా చీలి నేను దానిలో సగం మాత్రమే ఇరుక్కున్నట్లు బాధ అనుభవించాను. ధారావాహికంగా నా కన్నీరు ప్రవహించసాగింది. గంగకు అవి కనిపించకుండా తుడుచుకున్నాను. కాని, కన్నీటికి ఆనకట్ట తెగిపోయింది! నా ప్రయత్నం విఫలమయింది.

గంగ నావైపు తిరిగి "అమ్మ...గా...రూ! మా... అమ్మ...పి...చ్చిదండీ.....మా...అత్త...నా...కే..టో.. చే....త...బ..డి...చే...యిం..చిం..దని.. దాని పిచ్చి! నే...ను...ఇం...క...బ...త...క...ను!" ఆయాసంతో మాట ఆపింది.

"గంగా!" నా హృదయం బాధగా మూలిగింది.

"ఏ...డు...స్తుం...డా...రా? ఊ! మీ...రూ.. పి...చ్చో...ళ్లే." సన్నగా నవ్వింది గంగ. 'నిర్మలంగా నవ్వటం తప్ప నీ కింకేమీ తెలీదు గంగా' అనుకున్నాను. అయినా ఆ నవ్వు ఎంత నిర్మలంగా ఉన్నప్పటికీ ఎంతో విషాదం గూడు కట్టుకొని ఉంది. వాళ్లమ్మ కుమిలి కుమిలి చెప్పిన సారాంశం ఇది.

గంగను చూస్తే అత్తకు బొత్తిగా సరిపోదట. నవ్వినా ఏడ్చినా తప్పేనట. ఊరుకుంటే అంతకంటే మహా తప్పట! గంగను బలే హింస పెట్టేదని వేరే చెప్పక్కర్లేదు. గంగ భర్త ఏదో రైల్వేగేటు వద్ద 'గేటు కీపరు'గా పని చేస్తున్నాడట! అతడు నోరు విప్పని వాడవటం మూలాన అత్తగారి ఆగడం మరీఅధికమై పోయిందట. "పాపి అత్త పోరే గదా, ఎలాగో అందరు కోడళ్ళు, లోకంలో సంసారం చేసినట్లే తనూ అత్తింటి కాపరం సాగించా'లని గంగ ఓర్చుకునిపోయేదట. కాని, మామ కూడా అంతేనట. గంగ భర్తకు ఇద్దరు తమ్ముళ్లట. వారు ఆమె భర్తకంటే బాగా బలంగా ఎద్దుల్లా ఉన్నారట. గంగను వదినగా గౌరవించే బదులు అసహ్యంగా ప్రవర్తిస్తూ కనీసం "అమ్మా" అని అయినా సంబోధించకుండా ప్రవర్తించేవారట. ఏదో కుర్రతనం లెమ్మని గంగ సవరించుకొనిపోతే అదే చనువు కింద జమకట్టి గంగ శీలానికే ముప్పు తేవడానికి ప్రయత్నించారట ఆ కిరాతకులు! గంగ ఇవన్నీ సహించలేక భర్తతో చెప్పుకొని ఏడిస్తే అతడు భార్యపై నమ్మకమూ, ప్రేమమూ కలవాడు కాబట్టి వెంటనే ధైర్యం చేసి వేరే కాపరం పెట్టాడట.

అలా వాళ్లు వేరే కాపరం పెట్టి పచ్చగా కళ్లకి కనబడేసరికి తన కొడుకును వలలో వేసుకొని, కులుకుతూందనీ, తల్లిదండ్రుల నుండే కొడుకును దూరం చేసిందనీ గంగను గాలి దుమారంలా, హీనంగా పదుగురి ఎదట అవమానించేదట అత్త. అగ్నికి ఆజ్యం పోసినట్లు కొడుకులు కూడా అప్పుడో మాట అప్పుడో మాట వాళ్లమ్మకు చెప్పేవారట. వదిన ఫలాని వాడితో సంబంధం పెట్టుకుందని. ఇక ఆ అత్త ఆమెను ఎలా సతాయించేదో చెప్పలేము.

గంగ అత్త దగ్గిర కాపరం చేస్తున్నప్పుడు కొడుకుల మాటలు విని గంగ నశించిపోవడానికి మందు పెట్టిందట. గంగ అమ్మ ఓసారి గంగను చూడ్డానికని పోయినప్పుడు ఆ విషయం ఎలాగో కనుక్కొని ఎక్కడో తెలిసిన చోట మందు ఇప్పించిందట. తుదకు గంగ అత్త ఆమెను ఎలాగైనా హింసించాలన్న కోపంతో చేతబడి చేయించిందట.

గంగకు మొదట జ్వరం ముంచుకువచ్చింది. అది నయం కాకుంటే పట్నంలో ధర్మాసుపత్రిలో చేర్పించారట. అక్కడ ఒక నెల రోజులు ఉంచుకొని పంపించి వేశారట. ఇక చేసేదిలేక దేవుడిమీద భారం ఉంచి గంగను ఇక్కడికే పిలుచుకువచ్చిందట ఆమె అమ్మ.

ముత్యాలమ్మ చెప్పినదంతా విన్న తరవాత "అబ్బ! వాళ్లేం మనుష్యులు!" అన్న మాటలు నానోటి నుండి వెలువడ్డాయి. వ్యక్తం చెయ్యలేని బాధ అంతా ఆ మాటల్లో వ్యక్తం చేసినట్లయింది. గంగ నా మాటలు విందేమో! బాధగా, నీరసంగా నవ్వుతూ, "ప్రతి ... మనిషికి ... ఏదో ... ఒక ... వంకర ఉంటుంది గదమ్మగారూ!" అంది. ఒకప్పుడు ఆ మాట నేను గంగకు చెప్పిందే. ఆ మాటే తానూ నేర్చుకొని, అనుభవించి నా పాఠం నాకు అప్పజెప్పింది నేడు! నా బాధ ఆ మాట విన్నతోడనే ద్విగుణీకృతమయింది.

సుమారు రెండు వారాలు గడిచిపోయాయి నిస్సారంగా. ఒక్కొక్క రోజు ఒక్క దిన గండంగా ఉంది గంగకు. మనిషి రానురాను క్షీణించటం మొదలు పెట్టింది. అప్పటికి కూడా ఏదో నాటు వైద్యం చేయించసాగారు. ఎక్కడో మా ఊరికి పక్క పల్లెలో ఉన్న మంత్రాల మంగయ్యను మాట్లాడి పిలుచుకు వచ్చారు. అతడు ఇలాంటి చేతబడి వగైరా బాగు చేస్తాడట. అది ఎంతవరకు నిజమో కాని, ఇదంతా మూఢ విశ్వాసమనిపించేది ఒక్కొక్కసారి నాకు. గంగను శ్మశానానికి తీసుకువెళ్లి అక్కడ ఏదో చేసి వచ్చాడు అతడు. గంగకు క్రమంగా నయమవుతుందని చెప్పి అతడు తన ఊరు వెళ్లిపోయాడు. చాలా వాపులుగా ఉన్న గంగ కాళ్లు క్రమంగా చక్కబడ్డాయి. మనిషి కూడా కాస్త తేరుకుంటూందని వాళ్ల ఇంట్లోనే కాక నాకు కూడా నమ్మకం కలిగింది. గంగ కాళ్ల వాపులయితే తగ్గాయి కాని, మనిషిలో మాత్రం మార్పు లేదు. కృష్ణపక్షం నాటి చంద్రునివలె గంగ పరిస్థితి రానురాను నశించిపోసాగింది.

నాకు రాత్రిపూట నిద్ర వచ్చేదేకాదు. గంగ గుడిసె వైపే చూస్తూ పడుకునేదాన్ని. దరిద్ర దేవత కళ్లన్నీ



భిక్షాందేహి!

చిత్రం — ఆంజనేయులు (మద్రాసు-14)

ఆ గుడిసె కంతలే. అందులోంచి గుడ్డిగా వెలిగే దీపపు కాంతి మిణుకుమిణుకుమంటూ అగుపించేది. అలా ఆలోచిస్తూ పడుకుంటే నా చెంపలు పూర్తిగా కన్నీటితో తడిసిపోయేవి అప్రయత్నంగానే.

ఒకరోజు ఉన్నట్లుండి ఆ గుడిసెలో నుంచి ఏడుపులు వినిపించాయి. నా ఆత్రం కొద్దీ ఒక్క పరుగులో గుడిసెలో పడ్డాను. గంగకేమీ కాలేదు. ఎప్పటిలాగే ఉంది. గంగ అక్క లక్ష్మి వచ్చింది. గంగను చూస్తూ గుండెలు దబదబా బాదుకుంటూ హృదయవిదారకంగా విలపిస్తోంది లక్ష్మి. తండ్రి గంగ తలపై చెయ్యి పెట్టి నిమురుతూ, మరొకవైపు లక్ష్మిని సముదా

# మంట కలిసింది కంట మొలిచింది

యిస్తున్నాడు. ఆ సంఘటనతో నా మనస్సంతా వికలమై పోయింది. నేను కూడా గంగ పక్కనే చతికిలపడ్డాను.

"ఏడవ ... వద్దు ... అమ్మా ... నే...ను ... బాగానే... ఉన్నాను. నా...కే...ట...య్యిం...ద...ని?" అంది గంగ. ఆ మాటలు ఏ నూతిలోనుంచో పలికినట్లుంది. అక్కమ్మ ఏడుస్తూంది, ఇంకా బిగ్గరగా.

గంగ "నా...కం...టే...అదృ...ష్టం...గా నువ్వు ఏడు ... స్తా ... వే? నే ... ను... సచ్చి ... పో ... ను... బ...తు...కు...తా...న...క్కా...నువ్వేడవద్దు" అంది.

అంతలో గంగ అత్త, మామ, భర్త ఊరినుంచి వచ్చారు. గంగ కళ్ళతో ఆత్రంగా వెతికింది తన భర్త కోసం అని గమనించాను. అత్తమామలను కూర్చో మన్నట్లు సైగ చేసింది. భర్తను చూసి కళ్ళనిండా నీళ్ళు పెట్టి చిన్నగా నవ్వింది. ఆ ఆనందం ఏమని వర్ణించాలి? అది అనిర్వచనీయమైన ఆనందం! మమతలోని మకరందం.

గంగ అత్త అంది, "గంగమ్మా! నేనెవరు?" అని. నాకు అరికాలి మంట నడినెత్తి కెక్కింది. కొప్పు పట్టి బరబరా బయటికి లాగి చాకలి ఉతికినట్లు ఏ బండకో ఉతకాలనిపించింది. హంతకి, రాక్షసి, దుర్మార్గురాలు! ఆవిడనేమి చేసినా పాపం లేదని అనిపించింది. గంగ చిన్నగా నవ్వుతూ "ను...వ్వు...మా...అత్త...వు కాదూ!" అంది. "కాదు గంగా, నీ అత్త కాదు. నీ పాలిటి యమ భూతం!" ఆక్రోశించింది నా హృదయం. ఆ మామ పెదవి విప్పితే నోటి ముత్యాలు రాలుతాయేమోనన్నట్లు మౌనంగా కూర్చున్నాడు. నాకు మనస్కరించక అక్కడి నుంచి ఇంటికి వచ్చేశాను.

సాయంత్రం పనిమనిషి సుబ్బులు అంట్లు తోముతూ "సూడండమ్మగారూ! అదేం అతో్తగానీ మాట వస్తుందని సూసిపోడానికి వచ్చిందంట. అళ్ళు ఉండ మన్నా కూడా ఉండకుండా మొగుణ్ణి ఎంటబెట్టుకొని ఉడాయించిందప్పుడే. సేసిన ఘనకార్యానికి మొగ మెట్లా పెల్లుతుంది ఈడుండటానికి?" అంది.

నా కాశ్చర్యమేసింది. "అప్పుడే పోయిందా? మరి గంగ భర్త?"

"ఉన్నాడండి పాపం. అణ్ణి చూస్తే పాపం అని పిస్తాది. సేతుల్లో మొగం పెట్టుకొని ఎక్కిళ్లు వచ్చేటట్టు ఏడుస్తుండాడు" అంది.

"అళ్ల మామ పోతూ పోతూ "ఇక మూడు రోజులే గడువు. పేణం పోయేటప్పుడు వాయువొచ్చి నోట్లో చొంగ కారుతుంది. అది ఆగిపోనాక ఇది కూడా సచ్చి ఊరుకుంటుంది" అని అన్నాడండి. ఆడికెట్టా నోరు వచ్చిందో ఆడి నోట్లో పుండు పుట్ట! బంగారం లాంటి గంగమ్మను నాశనం చేసిండు."

నా గుండెల్లో రాయి పడినట్లయింది సుబ్బులు మాట వినగానే. "గంగా" అని గట్టిగా అరిచాను. అక్కడ ఇక ఉండలేక ఒక్క ఉరుకులో గంగను చేరాను. ఆమె పక్కన భర్త కూర్చుని గంగను తదేక ధ్యానంతో చూస్తూ కన్నీళ్లు కారుస్తూ ఉన్నాడు. కబోది తండ్రి కళ్లల్లోంచి అదే బాధ నీటి రూపంతో బయటికి వస్తూంది. అతనికి కళ్ళు లేవు కానీ, స్పర్శ ఉంది. ఆ స్పర్శతోనే గంగ ఒళ్లంతా నిమురుతూ ఆమె ఆకారం ఎలా ఉంటుందో చీకటిలో బొమ్మ గీసుకొని కుమిలిపోతూ ఉన్నాడు. తల్లి గంగ కాళ్ల దగ్గిర పడి ఉంది. ఇక చెల్లెళ్లంతా తడిక నానుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. తమ్ముడు మోకాళ్ల మధ్యన తల ఉంచుకొని రోదిస్తున్నాడు.

మూడు రోజులూ గడిచిపోయాయి. నేను ఆ రోజు భయంగా ఏమవుతుందో అని అక్కడే గంగ వద్ద ఉండి పోయాను. సుబ్బులు మాటలే చెవుల్లో గింగురు మంటున్నాయి. గొంతు ఏ మాటకయినా బొంగురు పోతూ ఉంది. అనుకుంటే తనువంతా విపరీతంగా కంపించిపోయేది. గంగకు నే ననుకున్నట్లే వాయువు వచ్చింది. నే నింతకుమునుపు వాయువు వచ్చి ఉండగా ఎప్పుడూ చూడలేదు. గంగ అందమైన కళ్ళు నిమ్మ కాయలలాగా పైకి ఉబికాయి. డొక్కలు ఎగరేస్తూ ఉంది. పళ్ళు బిగుసుకుపోయాయి. నోట్లోంచి చొంగ కారడం మొదలుపెట్టింది. నా గుండె అమిత వేగంతో కొట్టుకుంటూంటే ఆత్రంగా నా ఆదుర్దాకొద్దీ గంగను పట్టుకున్నాను. ఆ ఇంట్లో మిగిలిన అందరూ శోకాలు మొదలెట్టారు. కాసేపటికి వాయువు తగ్గి పోయింది. "గంగా" అని పిలిచాను. గంగ ఎటో చూస్తూ ఉంది. ఆ కళ్లలో మునుపటి కాంతి ఆగుపించింది.

గంగ ఎవరు పిలిచినా పలకలేదు. నేనప్పుడనుకున్నాను, గంగకు మాటల్లేవని. అంతేనా గంగ నోట్లో చివరి సారిగా నీళ్ళు పోశారు. గంగ ఏమో వెతుకుతున్నట్లు కళ్ళు తిప్పింది. గంగ భర్తను పిలిచి గంగకు అగుపడే టట్లు నిలుచోమని చెప్పి పక్కనేనేను నిలుచున్నాను. మా ఇద్దర్నీ మార్చి మార్చి చూసింది. ఆ కళ్ళలో సంతృప్తి గోచరించింది. మమ్మల్ని చూస్తున్న ఆ ముఖం పక్కకు వాలింది. అంతే. అయిపోయింది! గంగ పోయింది ఎక్కడికో దూర తీరానికి. దీపం ఆరిపోయింది! అంతా జరిగి పోయింది. ఏది కాకూడదనుకున్నానో అది జరిగి పోయింది. గంగలో ప్రాణం లేదుగానీ ఆ కళ్లలో ప్రాణం ఉంది. కాంతి ఉంది.

నా స్నేహలత వాడిపోయింది. మొదలంటా కూలి పోయింది. కానీ అది నాటిన స్థలం స్మృతిగా మిగిలి పోయింది. గంగ నన్ను వదిలిపోయినప్పటికీ గంగ స్మృతులు నన్ను వదల్లేదు. నా స్నేహానికీ, నా మమతకూ నా అనురాగానికీ, నా అభిమానానికీ నోచుకున్న గంగ నా హృదయంలో చిరంజీవిగా నెలవు చేసుకుంది. నా పాప కళ్లలో కాంతిగా జాజ్వల్యమానంగా ప్రకాశిస్తూ ఉంది. నా అంతులేని ఆవేదనకూ అర్థంలేని అనుబంధానికీ మారు పేరు గంగ.

నేను గంగను పిలుచుకోవాలి. ప్రతి దినమూ ప్రతి క్షణమూ గంగను పిలవాలి. గంగ నన్ను "అమ్మా" అనాలి. నేను ఆ పిలుపుతో తన్మయతతో ఆ కళ్లలోకి చూడాలి. ఆ కళ్లలో గంగ అగుపించాలి. అదీ నా ఆశ.

అందుకే నా ముద్దుల భవాని, నా ఒక్కగానొక్క కూతురు భవాని ఆనాటినుండీ నేటి వరకూ "గంగా భవాని"గా మార్పు పొందింది.

గతం అనే తెర తొలగి వాస్తవం కళ్లకగుపించింది. ఎదురుగా నా పక్కన గంగాభవాని, ఎర్రని కళ్లతో జేవురించిన ముఖంతో ఉన్న భవాని నా కన్నీటిచారలు తుడుస్తూ అగుపించింది.

"అమ్మా! నన్ను క్షమించు." తప్పు చేసినదానిలా భవాని నన్ను కోరింది.

"భవానీ! ఏమని. . . . . ." అని నేను అంటూండ గానే భవాని "అమ్మా! అలా పిలవకు. నన్ను గంగా అనమ్మా. గంగా అని ఎలుగెత్తి పిలు" అంటూ నా మెడ చుట్టూ చేతులు వేసి పెనవేసుకు పోయింది.

"గంగా!" నా శరీరం అంతా పులకించింది. తెలి యని అవ్యక్తానందంతో కళ్ళు అదే రీతిగా కన్నీరు వర్షించాయి. గంగ నా ఒడిలో ఉక్కిరి బిక్కిరి అయి ఓ పిరాడసంతటి ఆనంద సాగరంలో తేలిపోయింది.

"గంగా!" మళ్లీ పిలిచాను అనురాగంతో.

"అమ్మా!" గంగ నా కళ్లలోకి చూసింది. ఆ కళ్లలో స్వర్గంలో అమర సౌఖ్యం, హాయి అనుభవిస్తున్న నా గంగ నా పిలుపుతో ఉలిక్కిపడి "అమ్మగారూ!" అని నిండుగా నవ్వింది. గంగ నవ్వింది! నా మాతృక్షేత్రంలో నెమళ్లు పురి విప్పి నాట్యం చేశాయి! మోడుబారిన చెట్లు చిగురించాయి. గంగ నవ్వినందుకు కాలంగాని కాలంలో కూడా కోయిలమ్మ మధురాతిమధురంగా పాట పాడింది! ★

## మనసు మరొకచోట

చిత్రం — వీరిశెట్టి అచ్యుతరావు పులేటికుర్రు)

